www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 13 జనవరి 2025
5
తిరుపతి



ఇన్‌ఛార్జి సివిఎస్‌వోగా మణికంఠ చందోలు


టిటిడి ఇన్‌ఛార్జి సీవీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరిస్తున్న చిత్తూరు జిల్లా ఎస్‌పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇన్‌ఛార్జ్ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా చిత్తూరు జిల్లా ఎస్‌పీ విఎన్ మణికంఠ చందోలు ఆదివారం మధ్యాహ్నం తిరుపతి తిరుమల దేవస్థానం పరిపాలన భవనంలో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా ఎస్‌పీగా పని చేస్తున్న ఆయనను ఇటీవల బదిలీ అయిన తిరుపతి ఎస్‌పీ సుబ్బరాయుడు స్థానంలో ఇన్‌ఛార్జ్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించారు. టిటిడి సివిఅండ్ఎస్‌వోగా పని చేస్తున్న శ్రీధర్ కూడా బదిలీపై వెళ్లిన విషయం విదితమే. ఆయన స్థానంలో టిటిడి ఇన్‌ఛార్జి సివి అండ్ ఎస్‌వోగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. మణికంఠ చందోలు చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్‌పీగా, టిటిడి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు.

ఇంటింటికీ వంట గ్యాస్

- ప్రారంభించిన సీఎం
- నారావారిపల్లెలో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- తిరుపతి సిటి, రామచంద్రాపురం :తిరుపతిలో ఎజి అండ్ పి ప్రథమ్ థింక్ గ్యాస్ సంస్థ పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరాను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ప్రారంభించారు. అనంతరం తిరుచానూరులో వినియోగదారుడి ఇంట్లో గ్యాస్ స్టవ్ వెలిగించి టీ తయారు చేశారు. అధికారులతో కలిసి టీ తాగారు. అనంతరం వినియోగదారుడితో ముచ్చటించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ గ్యాస్, సిలిండర్ గ్యాస్ మధ్య తేడా గురించి ఆరా తీశారు. అనంతరం మూడు రోజుల సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు సొంత ఊరు నారావారి పల్లికి ముఖ్యమంత్రి బయలుదేరి వెళ్లారు.

తక్షణమే ఇల్లు మంజూరు

తిరుచానూరులో శరవణ ఇంటిని సందర్శించి వారి ఇంటికి అమర్చిన డొమెస్టిక్ పైపులైన్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) సరఫరాను ముఖ్యమంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి లబ్ధిదారుడు కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా టీ చేసి తాగారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను గ్యాస్ పైప్ లైన్ గురించి అడగగా వారు ఈ గ్యాస్ పైప్ లైన్ చాలా ఉపయోగకరంగా ఉందని ప్రతిసారి సిలిండర్లు అయిపోతే మళ్లీ సిలిండర్ తెచ్చుకునే వరకు ఇబ్బంది ఉండేదని ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదని, 24 గంటలు గ్యాస్ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని అన్నారు. మీటరు అమర్చుతారని ఎంత గ్యాస్ వాడితే దానికి మాత్రమే ప్రతినెల కరెంట్ బిల్లు లాగా గ్యాస్ బిల్లు కట్టుకోవడానికి చాలా సులభతరంగా ఉందని తెలిపారు. వారి వృత్తి, ఆర్థికపరమైన విషయాలు గురించి అడగగా తాను కార్పెంటర్ పని చేస్తున్నానని ప్రస్తుతం పనులు లేక రెండు ఆవులు ఉన్నాయని తెలిపారు. వారు తమకు సొంత ఇల్లు లేదని తెలుపగా అప్పటికప్పుడే రూ.3 లక్షల రూపాయలు గృహనిర్మాణ సంస్థ ద్వారా గృహాన్ని మంజూరు చేస్తూ అదనంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేసి, పిఎంఈ జీపీ కింద నాల్గు ఆవులకు రెండు లక్షలు మంజూరు చేస్తూ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్అండ్‌బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరని శ్రీనివాసులు, గాలి భాను ప్రకాష్, బొజ్జల సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నారావారిపల్లెకు చంద్రబాబు, లోకేష్

సీఎం చంద్రబాబు , ఐటీ మంత్రి నారా లోకేష్ కుటుంబ సభ్యులు స్వగ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు ఆదివారం రాత్రి 7.30 గంటలకు నారా వారిపల్లెకు చేరుకున్నారు. నారావారిపల్లెలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) టిడిపి నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మంత్రి లోకేష్ ఉదయం 11.30 గంటలకు నారావారి పల్లెకు చేరుకున్నారు. నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, నారా దేవాన్సులు సంక్రాంతి పండుగకు స్వగృహానికి చేరుకోవడంతో తిరుపతి ఇన్‌ఛార్జి ఎస్పీ మణికంఠ చందోలు నారావారిపల్లెలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నారా వారిపల్లెకి నారా కుటుంబ సభ్యులు చేరుకోవడంతో సంక్రాంతి సందడి నెలకొంది. సోమవారం వేకువ జామున చంద్రబాబు కుటుంబ సభ్యులు వారి ఇంటి ముందు భోగి మంటలు వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులు మూడు రోజుల పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

శేషాచల లింగేశ్వర స్వామి సేవలో మంత్రి లోకేష్, భువనేశ్వరి


స్వయంగా టీ తయారు చేస్తున్న చంద్రబాబు



గ్యాస్ పైపు లైను ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నారావారిపల్లి సమీపంలో ఉన్న శేషాపురం గ్రామంలో శ్రీశేషాచల లింగేశ్వర స్వామిని ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఐటీ శాఖ మంత్రి లోకేష్, భువనేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక టిడిపి నాయకులు రాకేష్ చౌదరి, ప్రతాప్ నాయుడు, ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారికి వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

తిరుపతి జిల్లా పర్యటనకు ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి సాదర స్వాగతం లభించింది. సీఎంకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, డీఐజీ షిమోషి బాజ్పాయ్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి ఇన్‌ఛార్జి ఎస్‌పీ మణికంఠ చందోలు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఛైర్మన్ సాదాశివం, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి, నగరి, గంగాధర్ నెల్లూరు, ఎమ్మెల్యేలు పులివర్తి వెంకట ముని ప్రసాద్(నాని) బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, అరణి శ్రీనివాసులు, భానుప్రకాష్, డాక్టర్ వి.యం థామస్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుపతికి రోడ్డు మార్గంలో వెళ్లారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కార్మికుల దీక్షలో
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి - వెంకటగిరి: మున్సిపల్ కార్మికుకు వెంటనే జీతాలు చెల్లించి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి శిబిరాన్ని సందర్శించి కార్మికుల దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు కార్మికుల పట్ల బాధ్యతా రాహిత్యంతో పనిచేస్తున్నారన్నారు. నానా దుర్భాషలాడిన కమిషనర్ వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా గత పది సంవత్సరాల నుండి ఇక్కడే తిష్ట వేసి విధులు నిర్వహిస్తున్న రామారావును వెంటనే బదిలీ చేయాలని, బదిలీ చేసే వరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు. బాధ్యతాయుతంగా పని చేయని ఇన్‌ఛార్జి కమిషనర్‌పై, శానిటర్ ఇన్‌స్పెక్టర్ రామారావుపై చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యల పరిష్కారం గురించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం ఆగదని జిల్లా స్థాయిలో ఉద్యమం చేపడుతామని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ గత ఎనిమిది రోజుల నుంచి మున్సిపల్ కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్నా ఛైర్‌పర్సన్ కాని, ఎమ్మెల్యే కాని పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. జీతాలైన ఇవ్వాలని, లేదంటే పండక్కి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపు తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్థానిక నాయకులు దొరబాబు, మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత భావన రెడ్డి చిన్నతంబు

- 'నిర్సన్ సిమ్ అండ్ లియో రేనాల్డ్' ప్రపంచ అందాల పోటీలు
- మలేషియాలో 40 దేశాలతో పోటీలో ఇండియా ఘన విజయం
- చంద్రగిరిలో భావన రెడ్డికి ఘన స్వాగతం


భావన రెడ్డి చిన్నతంబుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మిస్ గ్లోబల్ ఏసియా 2025 అందాల పోటీలలో చంద్రగిరికి చెందిన భావన రెడ్డి చిన్నతంబు (ఇండియా) విజేతగా నిలిచారు. నిర్సన్ సిమ్ అండ్ లియో రేనాల్డ్ వారి ప్రపంచ అందాల పోటీలు 40 దేశాలకు చెందిన యువతులతో జనవరి 9న మలేషియాలో నిర్వహించారు. ఈ పోటీలకు ఇండియా తరపున తిరుపతి జిల్లా, చంద్రగిరి, పాతపేట బాలాజీ నగర్‌కు చెందిన ప్రముఖ రియల్టర్ సి గోపికృష్ణ, లక్ష్మి దంపతుల కుమార్తె 2023 మిస్ ఇండియా ఐకానిక్ దివా విజేత భావనరెడ్డి చిన్నతంబు దక్షిణ భారత దేశం నుండి ఎంపికయ్యారు. నిక్సన్ సిమ్ అండ్ లియో రేనాల్డ్ నిర్వహించిన ప్రశ్నల పరంపరలో అన్ని రౌండ్లు తనదే పైచేయిగా నిలిచిన భావన రెడ్డి సభికులు హర్షాతిరేకాల నడుమ యావత్ ప్రపంచం వీక్షిస్తుండగా ఇండియాను విజేతగా ప్రకటించారు. ఆ మేరకు మిస్ గ్లోబల్ ఏసియా 2025 కిరీటాన్ని ధరించిన భావన రెడ్డి ఆనందతో ద్రవించిన హృదయం, చెమ్మగిల్లిన కంటతడిని పంటి బిగువున దాచుకుని యావత్ జాతికి, ప్రపంచానికి తన కీర్తిని తెలుపుతూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. యావత్ దేశం గర్వించదగ్గ రీతిన భావనరెడ్డి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి పొదిగిన కిరీటాన్ని ధరించి ఆదివారం చంద్రగిరి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రజలు, స్నేహితులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతూ బ్యాండు భాజాలు, బాణా సంచా పేలుళ్ల నడుమ జరిగిన భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. చంద్రగిరి కొత్తపేట నుండి పాతపేట వరకు అట్టహాసంగా సాగిన ఈ ర్యాలీలో 'మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత మావూరి అమ్మాయి రావడం గర్వకారణం' అంటూ ఆమెతో ఇంటికి చేరుకుని సంబరాలు జరుపుకున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల:

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధా, రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, సినీ సంగీత దర్శకుడు తమన్ తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ స్వామివారి సేవలో పాల్గొని వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. టీటీడీ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.

ఛార్జీల మోత!

- ప్రయాణికుల జేబులకు చిల్లు
- ఇదీ ఆర్‌టిసి ప్రత్యేక సంక్రాంతి బస్సు సర్వీసుల తీరు..

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: సంక్రాంతి పండుగ, సెలవులను దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ఛార్జీల మోత మోగిస్తోంది. జిల్లా నుంచి పలు సుదూర ప్రాంతాలకు స్పెషల్స్‌ను నడుపుతోంది. కానీ స్పెషల్ పేరుతో ప్రయాణికుల నుంచి భారీ స్థాయిలో ఛార్జీలు వసూలు చేస్తోంది. దీంతో పండగకు సొంత ఊర్లకు వచ్చే వారి జేబులకు చిల్లులు పడుతుండడం గమనార్హం.

సంక్రాంతి పండుగ.. తెలుగువారికి అత్యంత ప్రముఖమైన పండుగ.. భోగి, సంక్రాంతి, కనుమ, పశువుల పండుగ వరుసగా నాలుగు రోజులు పాటు జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ అంటే అందరికీ మక్కువ. అందుకు కారణం లేకపోలేదు.. ఎక్కడో సూదర ప్రాంతాల్లో బతుకు తెరువు కోసం జీవిస్తున్న వారు కూడా, సంక్రాంతి (పెద్ద పండుగ)కి సొంత ఊర్లకు వస్తుంటారు. కొత్త అల్లుళ్లు, కోడళ్లు, అత్తలు, మామలు, మరదలు, బావ మరుదులు, అన్నదమ్ములు, అక్కచెల్లెలు, అందరూ ఒక చోట చేరి పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా పండుగకు రెండు రోజుల ముందే దూర ప్రాంతాల్లో, పట్టణాల్లో, నగరాల్లో నివసించే వారు వారి గ్రామలకు వస్తుంటారు. దీంతో బస్సుల్లో, రైళ్లలో రద్దీ అధికంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 11 డిపోల ద్వారా మద్రాసు, కోయంబత్తూరు, బెంగుళూరు, మైసూరు. హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్టణం, అనంతపురం, కర్నూలు, రాజమండ్రి, చెన్నయ్, తదితర ప్రాంతాలకు సుమారు 300కి పైగా ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ఈ ఏడాది ప్రత్యేకించి ఆర్‌టిసియే కాకుండా ప్రయివేట్ బస్సు సర్వీసులను కూడా ప్రత్యేక సర్వీసులుగా వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ప్రత్యేక సర్వీసులు ఇవ్వడం ద్వారా ప్రయాణీకుల రద్దీకి తగ్గట్టు బస్సులను నడిపి వారికి రవాణా సౌకర్యం కల్పిస్తూనే, ఆదాయాన్ని కూడా సమకూర్చుకోవడం పరిపాటే. కానీ ఆర్‌టిసి అధికారులు మరో అడుగు ముందుకేసి, ప్రత్యేక సర్వీసులకు 1.1/2 వంతున ఛార్జీలు వసూళ్లు చేస్తున్నారు. అంటే సాధారణంగా తిరుపతి- హైదరాబాదు స్లీపర్ టికెట్ రూ.1400 నుంచి రూ.1800 వరకు వుంది. అదే ప్రత్యేక సర్వీసులు అంటే రూ.2100 నుంచి 2500 రూపాయల వరకు, స్లీపర్ టికెట్ ధర. తిరుపతి-విజయవాడ స్లీపర్ రూ.980, సిట్టింగ్ రూ.780, స్పెషల్ అయితే స్లీపర్ రూ.1380, సిట్టింగ్ రూ.1050 రూపాయలు వసూళ్లు చేయనున్నారు. దీంతో ప్రయాణికులు ఇళ్లు చేరేలోపే వారి జేబులకు చిల్లు పడనుంది.

ప్రైవేట్‌లో కాస్త నయం..

ఆర్‌టిసి బస్సులే కాదు.. ప్రయివేట్ సర్వీసులు సైతం రద్దీని దృష్టిలో ఉంచుకుని ధరలు పెంచనున్నాయి. సాధారణంగా తిరుపతి-హైదరాబాదు మధ్య స్లీపర్ రూ.1200 నుంచి 1800 వరకు ధర వుంది. రద్దీ సమయంలో రూ.1600 నుంచి 2200 వరకు వసూలు చేస్తుంటారు. తిరుపతి-విజయవాడ, తిరుపతి-బెంగుళూరు బస్సుల్లో సైతం ఆర్‌టిసితో పోల్చుకుంటే కొన్ని ప్రయివేట్ సర్వీసుల్లోనే అరకొరా తక్కువ వీవర్జీలు వసూళ్లు చేస్తుండడం గమనార్హం.

ప్రయాణికులకు సురక్షితమైన రవాణా, భద్రతతో కూడిన ప్రయాణం, తక్కువ ధరలకు అందించాలనే ఏర్పాటు చేసిన ఏపీఎస్ ఆర్‌టిసి ప్రభుత్వ సంస్థలో ఆదాయమే ధ్యేయంగా ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేసేందుకు పూనుకోవడం శోచనీయం. ఆర్‌టిసి అధికారులు సంక్రాంతి ప్రత్యేక సర్వీసుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకుని, ప్రయాణికులకు అవసరాలకు తగిన విధంగా సర్వీసులు నడపాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

అద్దె బస్సులను అదనంగా వాడుకోవడమే

ఈ ఏడాది సంక్రాంతికి ప్రయాణికుల అవసరానికి తగ్గట్టు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అందులో భాగంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా వివిధ డిపోల నుంచి, పలు ప్రాంతాలకు 300కుపైగా ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. ప్రయివేట్ బస్సులను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్‌టిసి ఆధ్వర్యంలో ఇప్పటికే అద్దె బస్సులను రోజుకు నిర్ణీత కిలోమీటర్ల మేరకు వినియోగించుకుంటున్నాం. ముఖ్యమంత్రి ఆదేశాలతో అవే అద్దె బస్సులను సుదూర ప్రాంతాలకు కూడా వినియోగిస్తున్నాం. అద్దె బస్సులను అదనంగా వాడుకోవడమే ప్రభుత్వ ఉద్దేశం.

-విశ్వనాథ్, డిప్యూటీ సిటిఎం, తిరుపతి రీజియన్.

బస్సు ఛార్జీలే మోపెడయ్యాయి..



పండుగ సందర్భంగా కర్నూలు నుంచి వెదురుకుప్పంలోని తమ్ముడింటికి కుటుంబ సమేతంగా వస్తే ప్రత్యేక సర్వీసుల పేరుతో అదనపు ఛార్జీలు వసూళ్లు చేశారు. నాలుగు ఫుల్, రెండు ఆఫ్ టిక్కెట్లకు వేల రూపాయలు ఖర్చయింది. ఛార్జీలు తగ్గిస్తే బాగుంటుంది.

-ప్రసాద్, అహోబిలం, కర్నూలు.

ఛార్జీలు చాలా ఎక్కువ..



ఏపిఎస్ ఆర్‌టిసి అనేది ప్రభుత్వ సంస్థ.. ఇందులో కూడా ఆదాయం కోసం అధిక ధరలు నిర్ణయించడం విడ్డూరంగా ఉంది. ప్రత్యేక సర్వీసుల్లో ఛార్జీలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దాన్ని తగ్గించాలి.

- తలారి స్వామి బంగారం, ఏలూరు, వెస్ట్‌గోదావరి జిల్లా.

సగం జీతం ఛార్జీలకే అయిపోయింది..



హైదరాబాదులోని ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నాను. పండగ కోసం సొంతూరు పెనుమూరుకు వెళుతున్నాను. బస్సు ఛార్జీలు అధికంగా ఉండడంతో రాను పోను ఛార్జీలకే సగం జీతం అయ్యిపోయేలా ఉంది. సాదాసీదా వ్యక్తులు బస్సులో రావాలంటే పండగ రోజుల్లో ఇబ్బందిగా ఉంది. అధికారులు ఇలాంటి నిర్ణయాలను మానుకోవాలి.

-గురు ప్రసాద్, ప్రయివేట్ కంపెనీ ఉద్యోగి, పెనుమూరు.

వాహన లైసెన్సుల మంజూరుకు పటిష్ట వ్యవస్థ

- నూతన ఆటోమేటెడ్ టెస్ట్ డ్రైవ్ ట్రాక్ ప్రారంభం
- జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వాహన లైసెన్సుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం టెక్నాలజీతో కూడిన పటిష్ట వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాహన లైసెన్సులు ఇకపై గతంలో కంటే మెరుగైన డ్రైవింగ్ చేసే వాహన చోదకులకు అవకాశం ఉంటుంది. నూతన ఆటోమేటెడ్ టెస్ట్ డ్రైవ్ ట్రాక్ సంక్రాంతి పండుగ తర్వాత సంపూర్తిగా అందుబాటులోకి తెస్తున్నామని పకడ్బందీగా ఇకపై లైసెన్స్ జారీ ప్రక్రియ కొనసాగుతుందని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, తదితరాలపై జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ తో 'ప్రజాశక్తి' ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించింది.

ప్రజాశక్తి: ప్రమాదాల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

అధికారి: తిరుపతి జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామ సరిహద్దులను కలుపుతూ ఉండే ప్రధాన రహదారులలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. రహదారుల వెంట వేగ నియంత్రణ సూచిక బోర్డులు, వేగ నిరోధకాల బోర్డులు, మలుపులకు సంబంధించిన సైన్ బోర్డులను ఏర్పాటు చేశాం. ప్రధానంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించాం.. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వ విభాగ అధికారులతో సమావేశాలు నిర్వహించి తగు సలహాలు, సూచనలు ఇస్తారు. తదనుగుణంగా రోడ్డు ప్రమాదాలు నివారించడానికి రవాణా శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నాం.

ప్రజాశక్తి: నూతన టెక్నాలజీతో కూడిన లైసెన్సు మంజూరు ప్రక్రియ ప్రారంభం అయ్యిందా?

అధికారి: గతంలో వాహనం నడిపే వ్యక్తి మోటార్ వెహికల్స్ యాక్ట్ నియమ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ ట్రాక్ పై వాహనాన్ని నడపాల్సి ఉండేది. వాహనం నడిపే వ్యక్తి తీరును బట్టి సంబంధిత మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరిశీలించి లైసెన్సులను మంజూరు చేసేవారు. ప్రస్తుతం నూతన టెక్నాలజీ తో కూడిన ఆటోమేటెడ్ టెస్ట్ డ్రైవ్ ట్రాక్ అందుబాటులోకి తీసుకువచ్చాం. ఎటువంటి సిఫార్సులు లేకుండా వాహనం నడిపే వ్యక్తి సైన్ బోర్డులను అనుసరిస్తూ వాహనాన్ని సెన్సార్ ప్రక్రియల ద్వారా ఆటోమేటెడ్ టెస్ట్ డ్రైవ్ ట్రాక్ పై నడపాల్సి ఉంది. దీంతో పారదర్శకమైన లైసెన్సు మంజూరు ప్రక్రియ జరుగుతుంది.

ప్రజాశక్తి: రవాణా విభాగానికి సంబంధించిన సేవలను వినియోగదారుడికి అందే ప్రక్రియను తెలపండి?

అధికారి: రవాణా శాఖకు సంబంధించి రిజిస్ట్రేషన్ ల కోసం వాహన్ పోర్టల్ ద్వారా సేవలను అందిస్తున్నాం. అదే లైసెన్సుల మంజూరు కోసం సారథి పరివాహన పరివాహన్ యాప్ ద్వారా వినియోగదారుడికి సేవలను రవాణా శాఖ అందిస్తోంది. వినియోగదారుడుకి సౌలభ్యమైన పద్ధతులలో రవాణా శాఖ సేవలు అందుబాటులో ఉన్నాయి. వాహన కొనుగోళ్లకు సంబంధించి జీవితకాలపు పన్ను రవాణా శాఖకు చెల్లించాలి. నూతనంగా ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసేవారు ఐదు సంవత్సరాలకు అంటే 10-01-2025 నుండి 10-12-2028 మధ్య కొనుగోలు చేసే వాహనాలకు సంబంధించి ఎటువంటి జీవిత కాలపు పన్ను చెల్లించనవసరం లేదు.. రాష్ట్ర ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. మిగిలిన వాహనాలకు యథాతథంగా పన్ను విధానం కొనసాగుతుంది.

ప్రజాశక్తి: నిబంధనలు పాటించని వాహనాలకు ఎటువంటి అపరాధ రుసుములు వసూలు చేస్తున్నారు.

అధికారి: నూతన వాహన చట్టం ప్రకారం లైసెన్సులు లేకుండా వాహనం నడుపుతూ పట్టుపడితే పదివేల రూపాయల జరిమానా విధిస్తున్నాం. మద్యం తాగి నడిపినా అధిక అపరాధ రుసుములుతో పాటు గా కేసు నమోదు చేసి కోర్టులకు పంపిస్తున్నాం. బస్సులు, ట్రావెల్స్ కు సంబంధించిన వాహనాలు త్రైమాసిక పన్నులు చెల్లించక వాహన తనిఖీల్లో పట్టుబడితే వారికి అపరాధ రుసుములను అమలు చేస్తున్నాం. ఏప్రిల్ నుండి ఇప్పటివరకు అపరాధ రుసుముల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి 9 కోట్ల రూపాయల నిధులను తిరుపతి జిల్లా రవాణా శాఖ నుండి అందించాం. హెవీ వాహనాలు పర్మిట్లు లేక జిల్లా పరిధిలో వాహన తనిఖీల్లో పట్టుబడితే వారికి భారీ మొత్తంలో అపరాధ రుసుమును వేస్తున్నాం. సకాలంలో వాహనాలకు సంబంధించిన పన్నులను చెల్లించి అపరాధ రుసుము చెల్లించే పరిస్థితి నుండి బయటపడాలని వాహనదారులకు సూచిస్తున్నాం. హెల్మెట్ ధరించి విధిగా ద్విచక్ర వాహనాలు నడపాలని ఆదేశించారు.

నేడే అనుప్పల్లిలో పశువుల పండుగ


జల్లి కట్టు పోటీలకు సిద్ధమైన అనుప్పల్లి

ప్రజాశక్తి -రామచంద్రపురం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం అనుపల్లిలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం పశువుల పండగ (జల్లికట్టు) నిర్వహించినట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగలో రాష్ట్రంలో మొట్టమొదట భోగి పండుగ రోజున అనుప్పల్లిలో జల్లికట్టు నిర్వహించడం విశేషం. పశువుల పండుగకు గ్రామంలో పశువుల దొడ్లు సౌండ్ సర్వీసెస్ ఏర్పాటు చేసి , మామిడి తోరణాలు, రంగు కాగితాలతో విశేషంగా అలంకరించారు. సోమవారం ఉదయం 11 గంటలకు గ్రామ దేవత సత్తెమ్మకు ప్రత్యేక పూజ నిర్వహించే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) పాల్గొననున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం పశువుల పండగ ప్రారంభమవుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ జల్లికట్టు కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి సుమారు 500కు పైగా, కోడెగిత్తలు 15 గుంపుల పశువులు పాల్గొంటాయి. సంక్రాంతి పండుగలో మొదటి రోజు కావడంతో జల్లికట్టును తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రేక్షకులు, జల్లికట్టు అభిమానులు, యువకులు భారీ స్థాయిలో హాజరు కానున్నట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. తారాసి మల్లికార్జున ఆచారి, మాజీ సర్పంచ్ యారం సుబ్రహ్మణ్యం ల జ్ఞాపకార్థం ప్రేక్షకులకు తాగు నీరు, అన్న ప్రసాదాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

యువతకి వివేకానందుడే ఆదర్శం: ఎస్‌వియు విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : నేటి యువతకు వివేకానందుడే ఆదర్శమని, ఆయన నేర్పిన సన్మార్గంలో పయనించి ఉత్తలుగా తయారు కావాలని ఎస్‌వియు అప్పారావు పిలుపునిచ్చారు. ఎస్‌వియు డిఎస్‌డబ్ల్యూసిఎ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతిని అన్నమయ్య భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య అప్పారావు మాట్లాడుతూ వివేకానందుడు యువతకి మాటల రూపంలోనూ, రచనల రూపంలోనూ ఇచ్చిన స్ఫూర్తి ఎప్పటికీ స్థిరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పాకనాటి హరికృష్ణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు బివి మురళీధర్, ఊక రమేష్ బాబు, సరిత, గణేష్, అకడమిక్ కన్సల్టెంట్ అధ్యక్షుడు రాంబాబు, తెలుగు యువత నాయకుడు ఆనంద గౌడ్ లు, ప్రకాష్, సుధాకర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి..

డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి -సత్యవేడు: డప్పు కళాకారులపై ప్రభుత్వం వివక్ష వీడి సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని సత్యవేడు మండలం సిరణంబుదూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సత్యవేడు డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు మెలుగు రమేష్ ఆధ్వర్యంలో డప్పు కళాకారులు ఆదివారం డప్పులు కొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు డప్పు కళాకారుల సంఘ గౌరవ అధ్యక్షులు మెలుగు రమేష్ మాట్లాడుతూ మండలంలో డప్పు కళాకారుల సంఘం ప్రారంభమై దాదాపు 15 సంవత్సరాలు అవుతున్నా ప్రభుత్వం డప్పు కళాకారులకు ఒక్క పెన్షన్ తప్ప మరొక లబ్ధి చేకూర్చకపోవడం పట్ల ఆవేదన వ్యక్తపరిచారు. ఈ పెన్షన్ కూడా డప్పు కళాకారుల పోరాట పటిమ వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయాక మొదటి ముఖ్యమంత్రి చంద్రబాబు డప్పు కళాకారుల విషయంలో చొరవ తీసుకొని కొన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టగా సత్యవేడులో మాత్రం అమలుకు నోచుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. సత్యవేడు డప్పు కళాకారుల సంఘంలో 164 మందికి గత ప్రభుత్వంలో నలుగురి కళాకారులకు మాత్రమే డప్పులు, గజ్జెలు ఇచ్చి సరిపెట్టుకొని తమ రాజకీయ లబ్ధి కోసం పెద్ద మొత్తంలో కళాకారులకు సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నామన్న ప్రచారానికి పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా తమను గుర్తించి ఆదుకుంటుందనే ఆశాభవంతో ఎదురుచూస్తున్న డప్పు కళాకారులకు ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టక పోవడంతో వారికి నిరాశే మిగిలిందన్నారు. పండుగలలో, శుభకార్యాలలో ప్రభుత్వ కార్యకలాపాల ప్రచారాలలో తమ వంతు పాత్ర పోషించే డప్పు కళాకారులను సంక్రాంతి పండుగ సందర్భంగా వారికి డప్పులు, గజ్జెలు, దుస్తులు ఇచ్చి కళాకారుల కుటుంబాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాలని ప్రభుత్వం వారిని గుర్తించకపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలలో 50 సంవత్సరాలు నిండిన డప్పు కళాకారులను గుర్తించి వారికి పెన్షన్లు అందించిన మాట వాస్తవమేనని కానీ అనంతరం 50 సంవత్సరాల వయోపరిమితి నిండిన లబ్ధిదారులైన కళాకారులకు పెన్షన్ నమోదు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇప్పటికన్నా ప్రభుత్వం డప్పు కళాకారులపై చిన్న చూపు వీడి వారికి అందాల్సిన పండుగ గౌరవమైన డప్పులు, గజ్జెలు, దుస్తులు అందించి 2025 నాటికి 50 సంవత్సరాలు నిండిన అర్హులైన కళాకారులకి పెన్షన్ అందించాలనే డిమాండ్ తో డప్పు కళాకారుల సంఘ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట డప్పు కొట్టి నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకుంటే డప్పు కళాకారులతో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు షణ్ముగం అల్లా స్వామి ధనంజయ కుప్పయ్య నాగరత్నం కృష్ణయ్య, కళాకారులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న డప్పు కళాకారులు

క్రైం న్యూస్

ఆలయంలో హుండీ చోరీ

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల బాలాజీ నగర్ వినాయక ఆలయంలో హుండీ చోరీకి గురైంది. శనివారం అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో హుండీలను దొంగలు అపహరించుకొని వెళ్లారు. రెండు హుండీలలో ఉన్న కానుకలను చోరీ చేసిన దొంగలు పక్కనే ఉన్న కమ్యూనిటీ హాల్ వద్ద హుండీలను వదిలివెళ్లారు. మూడు రోజుల క్రితమే కమ్యూనిటీ హాల్ వద్ద సర్వదర్శన టోకెన్లు టీటీడీ స్థానికులకు జారీ చేసింది. వినాయక చవితికి ముందు కానుకలను ఆలయ పెద్దలు లెక్కింపు చేశారు. అయితే పెద్ద మొత్తం కానుకలు వినాయక చవితికి వచ్చినట్లు సమాచారం . ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలను పట్టుకునేందుకు పోలీసులకు సవాల్‌గా మారింది.


చోరీకి గురైన ఆలయ హుండీ

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధూర్జటి నగర్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గిద్దలూరు సులోచనమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు గిద్దలూరు రాధాకృష్ణారెడ్డి ఆర్థిక సాయంతో వందమంది పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన సుమతి రెడ్డి విచ్చేశారు. ఎంతో కష్టపడే పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు అందించడం అభినందనీయమన్నారు. చేవూరు విజయ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంఘం అన్ని సామాజిక వర్గాలకు సాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి మధు రెడ్డి, ప్రధాన కార్యదర్శి పేట వెంకటకృష్ణారెడ్డి, సంఘ ఉపాధ్యక్షులు బత్తల సుబ్బారెడ్డి, దశరథ రామిరెడ్డి, కొత్తపల్లి సెకర్ కుమార్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, మండి శ్రీనివాసుల రెడ్డి, కలికి జనార్దన్ రెడ్డి, ఆమంచర్ల భాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రజేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఈ పంట నమోదు, ఈ కేవైసీ తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వ్యవసాయ అధికారి ఎన్ ప్రసాదరావు ఈ పంట నమోదు, ఈ కేవైసీను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటూరు గ్రామ రైతులు ఈ పంట, ఎన్‌పిఎస్ఎస్ యాప్ ఉపయోగాల గురించి తెలిపారు. కలిపెట్టు గ్రామ రైతులతో ధాన్యం కొనుగోలు, మార్కెట్ ధర గురించి అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా వుందని, రైతులు తప్పక, ఈ పంట నమోదు, ఈ కేవైసీ తప్పక చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన అంకు క్షేత్రం, నవార వరి పైరుని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు కండ్రిగ మండల వ్యవసాయ అధికారిణి భారతి, డిపిఎం షణ్ముఖం భరత్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షుడిగా ఒట్టూరు కిషోర్ యాదవ్



ప్రజాశక్తి-నాయుడుపేట: వైసిపి తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఒట్టూరు కిషోర్ యాదవ్‌ను నాయుడుపేట మండలం వైసిపి అధ్యక్షులుగా నియామకం చేస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం పాటుపడుతూ పార్టీకి ఎనలేని సేవలందించిన యువకుడు ఉత్సాహవంతుడైన ఒట్టూరు కిషోర్ యాదవ్‌ను మండల అధ్యక్ష పదవితో గౌరవించడంపై సూళ్లూరుపేట నియోజకవర్గ పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ ఆదేశాల మేరకు ఒట్టూరు కిషోర్ యాదవ్ ను నాయుడుపేట మండల పార్టీ అధ్యక్షులుగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ సందర్భంగా ఒట్టూరు కిషోర్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నాయుడుపేట మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండి, వారి సహకారంతో నాయుడుపేట మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాయుడుపేట వైసిపి నాయకులు, కార్యకర్తలు ఒట్టూరు కిషోర్ యాదవ్‌ను పూలమాలతో, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-నాయుడుపేట: సంక్రాంతిని పురస్కరించుకుని తన తల్లిదండ్రులైన అత్తికాయల సుబ్బరామయ్య, జ్ఞానమ్మల జ్ఞాపకార్థం నాయుడుపేట మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు ఒక నెలకు సరిపడ నిత్యావసర వస్తువులను, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు సునీత బెన్నీ మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా మాజీ నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం ప్రతి సంక్రాంతికి వృద్ధులను ఆదుకునేందుకు అనాథాశ్రమంలో నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఆయన ప్రోత్సాహంతో మరింత మందికి సహాయం చేసే అవకాశం లభించిందన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. అత్తికాయల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సంక్రాంతి పండగను అనాథ ఆశ్రమం లోని వృద్ధులు ఆనందంగా జరుపుకునేందుకు ప్రతి ఏడాది నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేయడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

ఘనంగా వివేకానంద జయంతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద 162 వ జయంతి వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్ కుమార్, మస్తానయ్య, స్కౌట్ మాస్టర్ జి విజయ్ కుమార్, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట లోని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ రామకృష్ణ మఠాన్ని స్థాపించి దీని ద్వారా భారత యువతకు దిశా నిర్దేశం చేశారన్నారు. ముప్పై తొమ్మిది ఏళ్ల వయసు లోనే మరణించారన్నారు. నేటి యువతకు దిశానిర్దేశం చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

పుత్తూరు టౌన్ : స్థానిక వివేకానంద పాఠశాలలో వేకానందుని జన్మదిన వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డి సదాశివం వివేకానందుని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పుత్తూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించి పేదకు అల్పాహారం అందించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మినీ గోకులం షెడ్డుకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి- సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండలం ఆరూరు గ్రామంలో మినీగోకులం షెడ్డుకు టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఆదివారం ఆరూరులో మహిళా రైతు విజయమ్మ నిర్మించిన మినీగోకులం షెడ్డును ఆయన ఉపాధిహామీ అధికారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు లోకమ్మ, సుమలత,మనోహర్ పలువురు పాడి రైతులుపాల్గొన్నారు.

స్కిట్ కు ప్రాణం పోయండి..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్కిట్ కళాశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చి ప్రాణం పోయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విన్నవించారు. బొజ్జల ఆదివారం లోకేష్ ను కలిశారు. స్కిట్ కళాశాల పరిస్థితిని వివరించారు. రాష్ట్రంలోనే దేవాదాయ శాఖ నడుపుతున్న ఏకైక ఇంజనీరింగ్ కళాశాల స్కిట్ అని తెలిపారు. అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో అది మూత పడిందని ఆవేదన వ్యక్తం చేస్తారు. మాజీ మంత్రి, తన తండ్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డికి స్కిట్ మానస పుత్రికగా ఉండేదని వివరించారు. కళాశాలకు జేఎన్టీయూ సహకారంతో ప్రాణం పోయాలని కోరారు. స్పందించిన లోకేష్ తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

చంద్రబాబుకు స్వాగతం పలికిన బొజ్జల

సంక్రాంతి నిమిత్తం నారావారి పల్లికి వెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్థానిక విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వాగతం పలికారు. ఆయనకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి వీడ్కోలు పలికారు.

రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడాలని యువతరం సేవా సమితి సభ్యులు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్తంగా నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ఆదివారం యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వించడం జరిగింది. సుమారు 50 మంది యువకులు రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోట : రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గూడూరు డివిజన్ కోట మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం కోట మండలంలో శ్రీ కోటమ్మ దేవాలయం వద్ద భవన నిర్మాణ సంఘం నాయకులతో సమీక్ష సమావేశాన్ని గూడూరు నియోజకవర్గ సిపిఎం నాయకులు పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయిలో 3.5 లక్షల భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, 'ఏనాడా కల్పించింది..తిండికే పెట్టింది..' అంటూ లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఎన్నో ఆందోళనలు చేపడుతున్న సమస్య పరిష్కారం కాక కార్మికులు ఆకలి కేకలు మిన్నంటుతున్నాయన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని భవన నిర్మాణ కార్మికులు నెలలు తరబడి పనులు లేక, కుటుంబాలను పోషించలేక వీధిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల భవన కార్మికులు ప్రభుత్వాలపై ఆధారపడి 40 రకాల పనులు నిలిపివేసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. లక్షలాది మంది కార్మికులు అప్పులతో జీవిస్తున్నారని, గత ప్రభుత్వంలో పాగా వేసిన ఇసుక మాఫియాను తొలగించి ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా చేస్తామని హామీలు ఇచ్చినా అవి అమలు కాక ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం చెప్పేవన్నీ ఆచరణలో నిజం కావడంలేదన్నారు. జీవో నెంబరు 12, 14ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఇప్పటికైనా ఇసుక సరఫరాతో ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు అతి తక్కువ ధరకు ఇసుకను సరిపడేంత అందించాలన్నారు. తక్షణమే ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి కార్మికుల జీవితాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోట మండల భవన నిర్మాణ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న భవన నిర్మాణ కార్మికులు

వారపుసంత కిటకిట

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): సంక్రాంతి పర్వదినాల్లో పెద్దలకు మొక్కడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి పండుగ రోజున పెద్దలకు పెట్టే దుస్తుల కోసం పెద్ద పెద్ద మాల్స్‌లో అధిక ధరలకు కొనలేక పేదలు ఆదివారం నిర్వహించిన వారపు సంత సందర్భంగా బస్టాండ్ కూడలి రహదారి పక్కనే ఉంచిన సంచార దుకాణం (వ్యాన్‌లో అమ్ముతున్న) దుస్తులను కొనడానికి పేద ప్రజలు, సామాన్యులు ఎగబడ్డారు. బడా బడా వస్త్ర దుకాణాలు మాల్స్ రేట్లుకు బెదిరి ఇదే తమకు బడా దుకాణం మాల్ అని భావించి తమపెద్దలకు దుస్తులు కొనుగోలు చేశారు. సంక్రాంతి పండుగలకు ఆదివారం చంద్రగిరి వారపు సంత కావడంతో వినియోగదారులు పెద్ద ఎత్తున కూరగాయలు కొనుగోలు చేయడానికి పోటెత్తారు. మండలంలో కంకర క్వారీలలో, ఇటుక బట్టీలలో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అధిక సంఖ్యలో ఉండటంతో వారపు సంత రోజున వారి యజమానులకు చెందిన ట్రాక్టర్లలో వచ్చి వారానికి కావలసిన సరుకులన్నీ ఒకేసారి కొనుగోలు చేస్తున్నారు. వలస కార్మికుల వాహనాలు స్థానిక ప్రజల ద్విచక్ర వాహనాలతో వారపు సంత ప్రాంతమంతా వాహనాల రద్దీ నెలకొని సంత కిటకిట లాడింది. మహిళా వినియోగదారులు దారి లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం వరకు పోటా పోటీగా ఉన్న వినియోగదారుల సాయంత్రం వేళ రేట్లు తగ్గుతున్న కారణంతో ఒకేసారి వారపు సంతకు విచ్చేయడంతో రద్దీ ఎక్కువైంది. వారపు సంత నిర్వహిస్తున్న ప్రాంతం ఇటు శ్రీనివాస మంగాపురానికి వెళ్లే రహదారి, అటు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారి కావడంతో సామాన్య ప్రజలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు కూరగాయలు రేట్లును రెట్టింపు ధరలకు విక్రయించి వినియోగదారులను నిలువునా దోచుకున్నారు. సంక్రాంతి వారపు సంత రద్దీని దృష్టిలో వుంచుకుని పంచాయతీ అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


జనంతో కిటకిటలాడుతున్న ప్రజలు

ఎంఈఓ హేమమాలినికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - పిచ్చా టూరు: తెలుగు కీర్తి 'జాతీయ ప్రతిభా పురస్కారానికి తిరుపతి జిల్లా, పిచ్చాటూరు మండల విద్యాశాఖధికారిణి కె హేమమాలిని ఎంపికయ్యారు. ఐఎస్‌వో గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహితీసంస్థ , శ్రీశ్రీ కళావేదిక ఇచ్చే ఈ అవార్డుకు హేమమాలిని ఎంపికైనట్లు ఆ సంస్థ సిఈఓ డాక్టర్ కట్టిమండ ప్రతాప్ నుండి ఆహ్వానం అందినట్లు తెలిపారు. శ్రీ శ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యం లో పురస్కారం అందుకోనున్నారు. పిచ్చాటూరు మండల విద్యాశాఖధి కారిణి గా విధులు నిర్వహిస్తూ, రచనలు, కవిసమ్మేళనాల్లో పాల్గొంటూ, గాయనిగా తెలుగు భాషా సంస్కృతి, సాహిత్యం, కళల పరిరక్షణకు నిరంతరం సామాజిక కార్యక్రమాల్లో రాణిస్తున్న హేమమాలిని తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారంకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.. ఈ సందర్భంగా ఆమె సంస్థ సిఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కి ధన్యవాదాలు తెలిపారు.



ఎస్‌వియూ విసి పోస్టును బీసీలకే ఇవ్వాలి

బీసీల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ నారాయణస్వామి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ రెగ్యులర్ విసి పోస్టును బీసీలకే ఇవ్వాలని బీసీల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కేతే నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కేతే నారాయణస్వామి అధ్యక్షతన బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర జనాభాలో బీసీలు 60 శాతంపైగా ఉన్నారని, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సగం కేటాయించాలని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నియమించబోయే రెగ్యులర్ ఉప కులపతుల పదవులలో బీసీలకు సగం కేటాయించాలన్నారు. ముఖ్యంగా టిడిపి ప్రభుత్వంలో ఇప్పటివరకు బీసీలకు ఎస్వీ యూనివర్సిటీకి రెగ్యులర్ ఉప కులపతులను నియమించలేదన్నారు. బీసీ ఆచార్యులలో నీతీ, నిజాయితీ, నిబద్ధత, కలిగిన, అకడమిక్ పరంగా అన్ని అర్హతలు కలిగి సమర్థమైన పరిపాలనా నిర్వహించ గల అర్హులైన వారిని గుర్తించి ఉప కులపతిగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు నాగార్జున ఆచారి మాట్లాడుతూ బీసీల ఓట్లతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. బీసీలకు నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కల్పించా లన్నారు. జంగమ సేవా సమితి జిల్లా మహిళ అధ్యక్షురాలు వసంత మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో జంగమ కులస్తులం దరూ కూటమి విజయానికి ప్రభుత్వానికి వందనాలు తెలిపారన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మాట్లాడుతూ బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు నెలకు 5 వేలకు పెంచాలని విశ్వవిద్యాలయాల పరిశోధన విద్యార్థులకు నెలకు 20 వేలు ఫెలో షిప్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, జిల్లా అధ్యక్షులు అమరనాథ్, సంఘర్షణ సమితి సభ్యులు చంద్రబాబు యాదవ్, బీసీ ఎంప్లాయిస్ జిల్లా నాయకులు సురేష్, గోపాల్, గాండ్ల సంఘం నగర అధ్యక్షులు ఉమాపతి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, జంగమ సంఘం నాయకులు భరత్, సుబ్రహ్మణ్యం యాదవ్, నరసమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక నాయకులు

'ప్రగతి' సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రశంసించారు. ప్రగతి సేవా సంస్థ 5వ వార్షికోత్సవం గూడూరు పట్టణంలోని సనత్ నగర్ లోని శ్రీ చైతన్య స్కూలు ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీల్ కుమార్ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం సంక్రాంతి పండుగ వాతావరణంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలు పది మందికి బహుమతులు అందించారు. ముగ్గుల పోటీకి జడ్జిలుగా మాజీ ఇన్నర్ వీల్ క్లబ్ ప్రసిడెంట్ స్నేహలత రెడ్డి, కేవీ హాస్పిటల్ డాక్టర్ కీర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ దిగ్విజయంగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరు సంవత్స అడుగుపెడుతున్న శుభ సందర్భంగా సంస్థకు తన నెల జీతంలో లక్ష రూపాయలు విరాళంగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ స్థాపించిన నాటి నుండి నేటి వరకు వెన్నెముకగా వుంటూ తమను నడిపిస్తున్న ఎమ్మెల్యేకు, సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బండి ధనుంజయ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ యమహా సుబ్రహ్మణ్యం, ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ప్రగతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మహిళలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

సంక్రాంతి క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తుమ్మలగుంట కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ కేంద్రంగా సంక్రాంతి క్రికెట్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే క్రికెట్ పోటీలను చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులకు అత్యంత సౌకర్యవంతంగా పిచ్‌పై జరిగే ఈ పోటీలను కేవీఎస్ క్రికెట్ అసోసియేషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. తుమ్మలగుంట గ్రామానికి నల్లందుల సుధాకర్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి క్రీడాకారులు టోర్నమెంట్ లో పాల్గొని తమ ప్రతిభను చూపించారు. క్రికెట్ క్రీడపై ఉన్న అభిమానంతో వంద మందికి పైగా క్రీడాకారులు టోర్నమెంట్ లో పాల్గొని గెలుపే లక్ష్యంగా పోరాడుతూ పరుగులతో చెలరేగుతున్నారు. ఇక్కడ గత పదేళ్లుగా ప్రతి ఏటా సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. ఉద్యోగం, వ్యాపారాల నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన యువకులు అందరూ సంక్రాంతి పర్వదినాన స్వగ్రామాలకు వచ్చి ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఆటలు ఆడేందుకు వీలుగా ఈ టోర్నమెంట్ ఉపయోగపడుతోందని పలువురు క్రీడాకారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలుగా నిలిచిన జట్టుతో పాటు టోర్నమెంట్ లో పాల్గొన్న క్రీడాకారులు అందరికీ జ్ఞాపికలను అందించనున్నారు.

భరతనాట్యంలో చిన్నారి ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : భరతనాట్యంలో మంచి కళాకారిణిగా ఎదగాలని ఆశయంతో చిన్నప్పటి నుంచి భరతనాట్యంలో మెళుకువలు నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు కోసం నిరంతరం పరిశ్రమిస్తోంది చిన్నారి ప్రశ్వితశ్రీ.. తిరుపతిలోని వివిధ కళాక్షేత్రాలలో అనేక ప్రదర్శనలతో పలువురి మన్ననలు పొందింది. భరతనాట్యంలో ఈ చిన్నారి తన ప్రతిభతో ఔరా అనిపిస్తుంది. భరతనాట్యంలో అంచెలంచెలుగా ఎదుగుతూ భరతనాట్యం ఊపిరిగా ఎంతో ఉత్తమంగా తిరుపతిలోని కళ్యాణి నాట్య కళాక్షేత్రంలో అభ్యసిస్తూ ఉన్న చిన్నారి పేరు బి ప్రశ్వితశ్రీ నంద్యాల జిల్లాలోని కొత్తపల్లిలో సురేష్, డాక్టర్ గీత దంపతులకు మొదటి సంతానంగా 2016, నవంబరు11 వ తేదీన జన్మించింది. ఈ చిన్నారి శాస్త్రీయ నాట్యాన్ని 2022 నుండి గురువు కీర్తి దగ్గర నాట్యం అభ్యసిస్తోంది. ప్రస్తుతం ఈ చిన్నారి విద్యానగర్ కాలనీ చైతన్య టెక్నో స్కూలులో 4వ తరగతి చదువుతోంది. ఈ చిన్నారి ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు వివిధ అకాడమీలలో నృత్య ప్రదర్శనలు చేసింది. ఈ చిన్నారి ప్రస్తుతానికి 10 ప్రదర్శనలు చేసింది. మొదట 2023లో కార్తీక పౌర్ణమి సందర్భంగా కాళహస్తీశ్వర దేవస్థానంలో నృత్య ప్రదర్శన చేసి అవార్డు, ప్రశంస పత్రాన్ని అందుకుంది. 2023 డిసెంబర్ లో టిటిడి నిర్వహించిన తిరుపతి నృత్యోత్సవం మహతి ఆడిటోరియంలో నృత్య ప్రదర్శన చేసి అవార్డు అందుకుంది. 2024 జనవరిలో కనుమ పండుగ సందర్భంగా గోసంరక్షణశాలలో నృత్య ప్రదర్శన చేసి బహుమతులు అందుకుంది. 2024 ఫిబ్రవరి బెంగళూరులో నిర్వహించిన "కర్ణాటక అచీవర్స్ బుక్ ఆఫ్ ఇండియా"లో నృత్య ప్రదర్శన చేసి అవార్డుతో ఆకట్టుకుంది. 2024 ఆగస్టు విశ్వం జీవకోనలో నిర్వహించిన దేశభక్తి సాంస్కృతిక సంబరాలలో నృత్య ప్రదర్శనచేసింది. 2024 సంవత్సరం సెప్టెంబర్ లో కాణిపాక బ్రహ్మోత్సవంలో నృత్య ప్రదర్శన చేసి అవార్డు అందుకుంది. 2024 సంవత్సరం నవంబరులో ఫ్రైడ్ ఇండియా కల్చరల్ వారు నిర్వహించిన "కార్తీక పౌర్ణమి డాన్స్ ఫేస్ట్ " లో నటరాజ అవార్డు అందుకుంది.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమావేశం గూడూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, , ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గౌరవ అధ్యక్షులుగా సురేష్, అధ్యక్షులుగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి రాము, కోశాధికారి సిద్ధేశ్వర్లు, కమిటీ సభ్యులు కరుణాకర్, చందు, శ్రీనివాసులు ,చంగల్ రావు , తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.


నూతన కమిటీని ఎన్నుకుంటున్న సిఐటియు నాయకులు

శ్మశానాలకు దారి సౌకర్యం కల్పించండి: సిపిఎం

ప్రజాశక్తి -కెవిబిపురం: కెవిబిపురం మండలంలో ఇప్పటికీ పలు గ్రామాలలో శ్మశానాలకు దారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ తెలిపారు. ఇటీవల కొత్తూరు గ్రామంలో ఒక మహిళ మరణిస్తే వ్యవసాయ పొలాల్లో అంతిమ సంస్కారాల కోసం అక్కడి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పడ్డ కష్టాలు వర్ణనాతీతం అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు అనేక పర్యాయాలు అధికారుల వద్ద ఆందోళన చేసినా అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాలేదని తెలిపారు. మండలంలో దిగువ పుత్తూరు, మహాదేవపురం, చాలా గ్రామాలకు నేటికీ దారి సౌకర్యం లేక ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదని జనార్ధన్ తెలిపారు. కొన్ని గ్రామాలకు శ్మశాన సౌకర్యం లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వున్న శ్మశానాలనూ కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి సమస్యలన్నింటికీ రెవెన్యూ సదస్సులలో ప్రజలు అర్జీల రూపంలో ఇచ్చారని తక్షణం రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మంగళం హోమియో వైద్యాధికారిణిగా శివజ్యోతి


వైద్యాధికారిణి శివజ్యోతిని అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం హోమియో ఆసుపత్రి వైద్యాధికారిణిగా శివజ్యోతి నియమితు లయ్యారు. ఈ మేరకు శివజ్యోతి మంగళంలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారిణి శివజ్యోతికి హోమియో ఆసుపత్రి సిబ్బంది తారకనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన వైద్యాధికారిణి ప్రసన్నలక్ష్మి చిత్తూరు పట్టణానికి ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయ్యారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

-ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గ్రామాల్లో అభివృద్ధే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం తొరూరు గ్రామ పంచాయతీ పైడిపల్లిలో ఉపాధి హామీ నుంచి 2.30లక్షల అంచనా వ్యయంతో రైతు జ్యోతికుమార్ నిర్మించిన మినీ గోకులం షెడ్డును గంజి మాధవయ్య ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్లు, మినీ గోకులాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఏ బాలాజీ, మండల మాజీ అధ్యక్షులు కరుణా యాదవ్, మోహన్ రాజు, మాజీ ఎంపీటీసీ కోట గజపతి, టీడీపీ నాయకులు చిన్నా, బాలక్రిష్ణారెడ్డి, మహేష్, హరిగోపాల్ పాల్గొన్నారు.


మినీ గోకులం షెడ్ ను ప్రారంభిస్తున్న గంజి మాధవయ్య

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో 2001- 04 సంవత్సరం చదువుకున్న విద్యార్థులు ఆదివారం కళాశాలలో విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల తర్వాత కళాశాలలో చదువుకున్న, పూర్వ విద్యార్థులందరూ జిల్లాల నుండి, దేశ విదేశాల నుండి వచ్చారు. ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల యాజమాన్యాన్ని సన్మానించారు. పూర్వ విద్యార్థులందరూ తమను తాము పరిచయం చేసుకొని, వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలు గురించి చర్చించుకున్నారు. పూర్వవిద్యార్థుల మాట్లాడుతూ చదువుకున్న కళాశాలకు, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మిత్రులందరికీ సరదాగా కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, కామర్స్ హెచ్‌ఓడి మల్లికార్జున రావు, అల్యూమిని అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజ్మల్ బాష, లెక్చరర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర విభాగంలో 1989-91 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 2025 జనవరి 12న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎల్. నాగమణిరెడ్డి, ఎస్. వెంకటరమణ, ఎన్. భాస్కర్ రెడ్డి, పి. గోవిందరాజులు ముఖ్య అతిథులుగా పాల్గొని తమ అమూల్యమైన సలహాలు, ఆశీస్సులు అందించారు.

లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - క్యాంపస్ : సంక్రాంతి పండుగ సందర్భంగా తిరుపతి పర్యటనలో భాగంగా కుంటుంబ సభ్యులతో నారావారి పల్లెకి విచ్చేసిన మానవ వనరుల, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఆర్టీజి మంత్రి నారా లోకేష్‌ని రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా ఫీజు రీయింబర్సుమెంటు 788 కోట్ల రూపాయలు విడుదల చేసినందుకు మంత్రి లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అబద్ధాల హామీల కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారని 3,450 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు ఉన్నాయని జగన్ మోహన్ రెడ్డి పాలనలో బకాయిలు విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం మీద నిందలు వేస్తున్నారని ఆరోపించారు. 3,450 కోట్ల రూపాయల బకాయిలో భాగంగా మొదటి విడతలో 788 కోట్ల రూపాయలు విడుదల చేశారని రానున్న రోజుల్లో మిగతా బకాయిలను కూడా విడుదల చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి: సిపిఎం

ప్రజాశక్తి -నారాయణవనం: నారాయణవనం మండలం సముదాయం గ్రామ సమీపంలో గిరిజన కాలనీ, పాఠశాల ఆవరణలో వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గిరిజనుల నివాసాలకు పాఠశాల కు ప్రమాదకరంగా గోతులు ఏర్పడి ప్రజల ప్రాణాలకు నష్టం ఏర్పడుతోందని ప్రజలు భయాందోళనకు గురవుతున్న నేపథ్యంలో తక్షణం అక్రమ ఇసుక ను అరికట్టాలని రెవెన్యూ పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.